## క్లుప్తంగా

### పెండింగ్ పనులు పూర్తి చేయండి



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ జంగయ్య

**బోడుప్పల్:** 1వ డివిజన్ పరిధిలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్ గురువారం బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో ఉన్న రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం రూ. 2 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఇటీవల తీర్మానం చేసిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

### ఎన్‌యూజే జాతీయ కార్యదర్శిగా చంద్రమోహన్



**కాప్రా/కుషాయిగూడ:** నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఎన్‌యూజే(ఐ) జాతీయ కార్యదర్శిగా కాప్రా సర్కిల్‌కు చెందిన మెరుగు చంద్రమోహన్ ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ.. జాతీయ కార్యదర్శిగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో జాతీయ కార్యదర్శిగా ఎన్నికకు సహకరించిన జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్‌శర్మ, త్రియుగ్ నారాయణ తివారీతో పాటు ఇతర సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

### వైద్య ఖర్చులకు సాయం



**గౌతంనగర్:** ఇందిరానెహ్రూనగర్ బస్తీలో నివసించే పార్వతి కుమార్తె దీపాలి(8) కాలేయ వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న మానవసేవే-మాధవసేవ కుమ్మరి రాజు గ్రూపు రూ.10 వేల ఆర్థికసాయాన్ని గురువారం బాధిత కుటుంబానికి వాట్సాప్ గ్రూపు సభ్యులతో కలిసి అందజేశారు.

### ట్రాఫిక్ సిగ్నల్స్ లేక..
ఇబ్బంది పడుతున్న వాహనదారులు



ఉత్తంనగర్ చౌరస్తాలో వాహనాల రాకపోకలు

**గౌతంనగర్:** గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. డివిజన్ పరిధిలోని గౌతంనగర్, మల్లికార్జుననగర్, సాయినగర్, మిర్జాల్‌గూడ, మల్కాజిగిరి చౌరస్తాతో పాటు ఉత్తమ్‌నగర్ చౌరస్తాలో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ట్రాఫిక్ సిగ్నల్ లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సిగ్నల్స్ ఏర్పాటు చేస్తేనే సమస్య పరిష్కారం అవుతుందని వాహనదారులు చెబుతున్నారు.

### ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



ప్రశంసాపత్రాలతో కళాకారులు

**మల్కాజిగిరి:** అయోధ్యలో మల్కాజిగిరికి చెందిన చిన్నారులు నృత్యప్రదర్శనలో జయకేతనం ఎగురవేశారు. సైనిక్‌పురి సమీపంలోని భావనాలయ కూచిపూడి నాట్యాలయ విద్యార్థినులు కూచిపూడి నృత్య ప్రదర్శనలో గెలుపొందారు. నృత్యాంజలి సెంటర్ ఫర్ గ్లోబల్ ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్ ఆధ్వర్యంలో బాలరాముడి ఆలయం సమీపంలో అంతర్రాష్ట్ర పోటీలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలో శ్రీనిక, ఆముక్త, యశ్వర్థిక, లాలిత్య, దేవాన్షి, హర్షిణి, సుదీక్ష, పావిక, నిత్యలు ప్రతిభ కనబరిచారు.

### గురుపూజ మహోత్సవం

**మల్లాపూర్:** ఎంవీఆర్ గురు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మల్లాపూర్ వీఎస్ఆర్ గార్డెన్‌లో విశ్రాంత ప్రధానాచార్యులు, మూర్తి వేఙ్కట్రామ శర్మను శిష్యులు ఘనంగా సత్కరించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. డాక్టర్ విష్ణుభట్ల సుబ్రమ్మణ్య సదాశివమూర్తి, మాణి ద్రావిడశాస్త్రి, ప్రభాకరశర్మ, సుబ్రహ్మణ్యశర్మ, శేషాచార్యులు, ఎంవీఆర్ గురుసేనా ట్రస్ట్ నిర్వహకులు శ్రీనివాస్‌శర్మ, సంపత్కుమార శర్మ, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తి పనులతో అవస్థలు !

● రూ. 3.5 కోట్లతో చేపట్టిన డ్రైనేజీ పనులు ● ఏడాదిన్నర అవుతున్నా పూర్తి కాని వైనం

**గౌతంనగర్:** వరద ముంపు నివారణకు మల్లికార్జునగర్‌లో గతేడాదిన్నర క్రితం మల్లికార్జుననగర్‌లో రైల్వే ట్రాక్ కింద నుంచి 2 బాక్స్ డ్రైనేజీ నిర్మాణానికి సుమారు రూ.3.5 కోట్లతో చేపట్టిన డ్రైనేజీ పనులు అసంపూర్ణంగా కొనసాగుతున్నాయి. రైల్వే అధికారులు చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులు నేటికి నత్తనడగా కొనసాగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు మిర్జాల్‌గూడ వైపు బాక్స్ డ్రైనేజీ పూర్తయినప్పటికీ మల్లికార్జుననగర్ పనులు నత్తనడకనే కొనసాగుతున్నాయి.



మల్లికార్జుననగర్‌లో పూర్తికాని బాక్స్ డ్రైనేజీ పనులు

**10 రోజుల్లో పూర్తి చేస్తాం**

మిర్జాల్‌గూడ వైపు బాక్స్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. మల్లికార్జుననగర్ వైపు కొనసాగుతున్న పనులు సుమారు 10 రోజుల్లో పూర్తి చేస్తాం. పనులు పూర్తయిన వెంటనే జీహెచ్ఎంసీ బాక్స్ డ్రైనేజీకి ఇతర నాలాలు అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది.

– ఆంజనేయులు, కాంట్రాక్టర్

**వర్షం పడితే చాలు...**

గౌతంనగర్ డివిజన్ పరిధిలో వర్షం పడితే చాలు దిగువ ప్రాంతాల్లోని పలు కాలనీలు ముంపునకు గురవుతుంటాయి. మిర్జాల్‌గూడ ప్రాంతంలోని వెంకటాద్రినగర్, రాజానగర్, రాజాశ్రీనివాస్‌నగర్, ఓల్డ్ మిర్జాల్‌గూడ, చిన్మయ్‌మార్గ్, పవన్ మోటర్స్ తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

◆ ఆయా కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను తీర్చడానికి మల్లికార్జుననగర్, హనుమాన్‌పేట్ కాలనీల మధ్య రైల్వేట్రాక్ కింద గతేడాదిన్నర క్రితం రూ. 3.5 కోట్ల వ్యయంతో రైల్వే, జీహెచ్ఎంసీ అధికారులు డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరణ చేపట్టారు. నేటికి పనులు పూర్తి కాకపోవడంతో డ్రైనేజీ నిర్మాణ పనులు అసంపూర్ణంగా మిగిలాయి.

**వరదనీరు సజావుగా వెళ్లేందుకు..**

గతంలో ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా మారడంతో పాటు ఎత్తు ప్రాంతాల నుంచి మహేంద్రహిల్స్, అన్నపూర్ణ సొసైటీ, గోపాల్‌నగర్, మల్లికార్జుననగర్, జ్యోతినగర్, గౌతంనగర్, దయానంద్‌నగర్, ఇందిరానెహ్రూనగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వరదనీటి కారణంగా దిగువ ఉన్న కాలనీలు నీట మునుగుతున్నాయి.

**డ్రైనేజీ వ్యవస్థ లేదు..**

కాలనీల్లో ఇళ్లు పూర్తిస్థాయిలో ఏర్పడినా.. తగినస్థాయిలో మురుగు నీటి వ్యవస్థ ఏర్పడలేదు. నిత్యం నాలాలు పొంగి నీరు ఇళ్లలోకి వచ్చి చేరుతోందని ప్రజలు వాపోతున్నారు. ప్రజలు స్థానిక కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్‌లు, ఇతర పార్టీ నేతలు పలుమార్లు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మల్లికార్జుననగర్ వద్ద ఉన్న ట్రాక్ కింద 5 మీటర్ల లోతు, 11 మీటర్ల పొడవున బాక్స్ డ్రైనేజీ ఏర్పాటుకు రైల్వే అధికారులు అంగీకరించి రైల్వే అధికారులు పనులు ప్రారంభించారు. నేటికి పూర్తి కాకపోవడంతో ఇబ్బందిగా మారిందని ప్రజలు వాపోతున్నారు. పనులు పూర్తైతే జీహెచ్ఎంసీ నాలాలకు అనుసంధానం చేస్తే మురుగు, వరద నీరు సాఫీగా వెళ్తుంది.

# 13 నుంచి హజ్రత్ అలీ ఉర్సు





మౌలాలి ఛిల్లా సమీపంలో ఒంటెపై నకారా చేస్తున్న దృశ్యం

**మౌలాలి :** హజ్రత్ అలీ జయంతి సందర్భంగా ఈనెల 13 నుంచి 20 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఉర్సు ఉత్సవాలకు విదేశాల నుంచి భక్తులు సందర్శిస్తుంటారు. ప్రధానంగా సౌది అరేబియా, ఇరాన్, ఇరాక్, యూఏఈ తదితర దేశాల నుంచి భక్తులు వస్తుంటారని స్థానికులు చెబుతున్నారు. రజాబ్ క్యాలెండర్ ప్రకారం 12వ రోజున ఇంగ్లిష్ కేలండర్ ప్రకారం ఈనెల 13 ఉర్సు ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఆ రోజు రాత్రి షియా ముస్లింలు తమ ఇళ్లలో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకుంటారు. 14న సాయంత్రం పాత నగరం నుంచి 200 మంది భక్తులతో సేరా, 16న ఆర్టీసీ కాలనీ, చిలకలగూడ నుంచి భజా భజంత్రీలతో సేరా, 17న సర్కారీ సంధల్‌ను ఒంటెలు, ఏనుగులు, గుర్రాలపై తీసుకురావడం అనవాయితీ. మౌలాలి కమాన్ నుంచి దర్గాకు ఇరువైపులా ఏర్పాటు చేసిన స్వాగత వేదికల వద్ద సేరాలను తీసుకొచ్చే భక్తులకు స్వాగతం పలుకుతారు. 20న అన్ని మతాలకు చెందిన భక్తులు మొక్కులు చెల్లించుకుంటారని ఉర్సు నిర్వాహకులు వివరించారు.

**ఒంటెపై నకారా...**

◆ ఓల్డ్ సిటీ నుంచి మౌలాలి గుట్టపైకి ఒంటెపై నకారాతో వచ్చి, వీధి వీధినా ఒంటెపై నకారా కొట్టి తీసుకొస్తారు. మౌలాలి హజరత్ అలీబాబా దర్గా గుట్టపై వారం రోజులు జాతర జరుగుతుందని, 14న రాత్రి నుంచి 17 వరకు ప్రజలందరూ అలీబాబా దర్గాను దర్శించుకునే అవకాశం ఉందని, దర్గా సూపరింటెండెంట్ సయ్యద్ ప్రకటించారు. కమిటీ సభ్యులు రజా అలీ, ముజీబ్ జమ, సజాద్, ఇబ్రహీం, కుద్దూస్ పాల్గొన్నారు.

# ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం

**అల్వాల్:** ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద దేశంలోని రైతులకు రూ.6 వేలు ఇస్తున్న కేంద్రం నేటి నుంచి రూ.10 వేలకు పెంచడంపై బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం బీజేపీ అల్వాల్ సర్కిల్ నేతలు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. దేశాన్ని రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా చేయాలనే సంకల్పంతో ప్రధాని రైతులకు పెద్దన్నగా నిలుస్తున్నారన్నారు. నాయకులు మల్లిఖార్జున్‌గౌడ్, అజయ్‌రెడ్డి, కార్తీక్‌గౌడ్, రవికిరణ్, నేతలు శేఖర్, సంతోష్‌గౌడ్, శ్రీనివాస్, ఉదయ్‌ప్రకాష్, బన్సల్, మాణిక్యరెడ్డి, సుజాత, లక్ష్మణ్, కార్తీక్, చంద్రకాంత్, నాగి తదితరులు పాల్గొన్నారు.



## ‘ఎమ్మెల్యే కృషితోనే ఉత్తర హైదరాబాద్‌కు మెట్రో’



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో మెట్రో రైల్ సాధన సమితి సభ్యులు

**అల్వాల్:** మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా మెట్రో రైల్ సాధన సమితి సభ్యులు గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉత్తర హైదరాబాద్‌కు మెట్రో రైల్ ఆవశ్యకతను సీఎం రేవంత్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ ఎన్‌వీఎస్‌రెడ్డికి వివరించి వినతిపత్రాలు అందించామన్నారు. సీఎం ప్రతిపాదనలను సిద్ధం చేసి అధికారులను ఆదేశించడంతో మెట్రో రైల్ ప్రాజెక్టు ఏర్పాటుకు మార్గం సులభమైందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సంపత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, అనిల్, గిరిధర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో సంక్షేమానికి పెద్దపీట



సీఎం రేవంత్‌రెడ్డితో గడ్డం రవి కాంగ్రెస్ నేతలు

**ఉస్మానియా యూనివర్సిటీ:** కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర అభివృద్ధితో పాటు సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు పార్టీ సీనియర్ నాయకులు గడ్డం రవి పేర్కొన్నారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు. ఇందిరమ్మ రాజ్యం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన పేరుతో ప్రజలకు మరింత చేరువై కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తున్నారన్నారు. ఏఎస్‌రావునగర్ మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి, గిరిబాబు, దేవేందర్ చౌదరి పాల్గొన్నారు.

## కొనసాగుతున్న శుభాకాంక్షల వెల్లువ

**గౌతంనగర్:** మల్కాజిగిరికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బోనగిరి సురేష్‌యాదవ్ గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

**మల్లాపూర్:** ఆటో యూనియన్ నాయకుడు సీహెచ్. సాయికుమార్ ఎమ్మెల్సీ కవితను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.నూతన సంవత్సరం సందర్భంగా గురువారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ కార్మికుల సమక్షంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. పలువురు నేతలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు కార్పొరేటర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జీహెచ్ఎంసీ కార్మికుడు కుర్మన్న, ఎస్ఎఫ్ఏ లక్ష్మి ఉన్నారు.

**బోడుప్పల్:** సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్‌ను గురువారం బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, నేతలు పులకండ్ల జంగారెడ్డి, గుర్రాల వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డితో బోనగిరి సురేష్‌యాదవ్

**ఉప్పల్:** నూతన సంవత్సరం సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



కమిషనర్ నవీన్ మిట్టల్‌తో మేయర్ అజయ్‌యాదవ్



ఎమ్మెల్సీ కవితతో సాయికుమార్

## విద్యార్థిని చితకబాదిన టీచర్
తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు

**రామంతాపూర్ :** గణేష్‌నగర్‌లోని కాకతీయ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని టీచర్ తీవ్రంగా చితకబాదిన ఘటన గురువారం చోటు చేసుకుంది. తల్లిదండ్రులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మ్యాథ్స్ సబ్జెక్టు బోధించే టీచర్ ఘన్‌శ్యామ్ విద్యార్థి బబ్లూ దాస్ సాహును జియోమెట్రీ బాక్సు తీసుకురాలేదని కొట్టడంతో 20 నిమిషాల పాటు స్పృహ కోల్పోయాడన్నారు. దీనిపై విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కేలండర్ల ఆవిష్కరణ

**రామంతాపూర్ :** గణేష్‌నగర్‌లోని రాష్ట్ర మున్నూరు కాపు డెవలప్‌మెంట్ ఫోరం నూతన సంవత్సర కేలండర్‌ను ఫోరం అధ్యక్షుడు ఎడ్ల రవి పటేల్ గురువారం ఆవిష్కరించారు. ఫోరం ప్రధాన కార్యదర్శులు ఎం.అశోక్‌పటేల్, సాయిబాబా పటేల్, అంజయ్య పటేల్, నవీన్ పటేల్, సత్యనారాయణ పటేల్, జగదీష్ పటేల్, ప్రసాద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

**గౌతంనగర్:** ‘సబర్బన్ ట్రెన్ అండ్ ట్రావెలర్స్ అసోసియేషన్’ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 కేలండర్‌ను సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ శ్రీధర్ గురువారం ఆవిష్కరించారు. ప్రయాణికులు సౌకర్యం కోసం అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అసోసియేషన్ సభ్యులు నూర్, ఏవీ.స్వామి, భరద్వాజ్, శంకర్‌రావు ఉన్నారు.

**అల్వాల్:** మేరు సంఘం తెలంగాణ జోన్-11 అల్వాల్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం లోతుకుంటలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. అధ్యక్షుడు రాపర్తి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షులు మాడిశెట్టి బాలయ్య, రామగిరి గోపాల్, సత్యనారాయణ, భూపాల్, కార్యదర్శులు గణేష్, కరుణాకర్, సుధాకర్, బాల్‌నర్సయ్య, రామకృష్ణ, వినోద్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరిస్తున్న రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ శ్రీధర్

**మల్లాపూర్:** బ్రహ్మపురి కాలనీలోని శ్రీకరి మహాసన హైస్కూల్ నూతన కేలండర్‌ను గురువారం పాఠశాల ఛైర్మన్ ఎస్. సాయిబాబా ఆవిష్కరించారు. మేనేజ్‌మెంట్ సుచిత్ర రేఖ, పద్మజా రేఖ, గిరిజా రమణి, వైస్ ఛైర్మన్ పుష్పలత, ప్రిన్సిపాల్ రాజాన్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



ఆవిష్కరిస్తున్న ఛైర్మన్ సాయిబాబా



## నేడు వాహనాల వేలం

**ఉప్పల్:** ఉప్పల్ ఎక్సైజ్ పోలీసుల సమక్షంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు అధికారి ఓంకార్ ప్రకటించారు. శుక్రవారం పోచారం మున్సిపాలిటీ ఘట్‌కేసర్ ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. 20 ద్విచక్ర వాహనాలు, 6 ఫోర్ వీలర్స్‌ను వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 8712658738.

## జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు

**బోడుప్పల్:** ప్రమాద రహిత సమాజం కోసం ఆర్టీసీ డ్రైవర్లు కృషి చేయాలని చెంగిచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత అన్నారు. గురువారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను ఘట్‌కేసర్ ట్రాఫిక్ ఎస్సై మల్లయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఏకాగ్రత, మానసిక ప్రశాంతతో విధులు నిర్వహిస్తే ప్రమాదాలను నివారించవచ్చని అభిప్రాయపడ్డారు. అసిస్టెంట్ మేనేజర్లు సాయి సుబ్రమణ్యం, సూపరిండెంట్ ట్రాఫిక్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్ అరుణలక్ష్మి, అక్బర్, కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎం కవిత

## స్వయం సహాయక బృందానికి జాతీయ పురస్కారం

**సాక్షి, సిటీబ్యూరో:** స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జి)ను ప్రోత్సహించేందుకు పెప్సీకో ఇండియా ప్రారంభించిన జాతీయ స్థాయి రివల్యూషనరి అవార్డ్‌ను ఎకనామిక్ ఎంపవర్మెంట్ త్రూ ఎస్‌హెచ్‌జీ విభాగంలో మన రాష్ట్రానికి చెందిన గణపతి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ దక్కించుకుంది. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. ఆర్థిక స్వతంత్రత, గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించడం ద్వారా దాదాపు 10వేల మంది మహిళల జీవితాల్లో గణపతి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సానుకూల మార్పు తెచ్చింది.

## తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



**ఉప్పల్:** జార్ఖండ్ రాజధాని రాంచీ ఖేల్గావ్‌లోని హరివంశ్ తానా భగత్ ఇండోర్ స్టేడియంలో గత వారం జరిగిన భగవాన్ బిర్సా ముండా ట్రోఫీ ఓపెన్ నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్-2024లో తెలంగాణ చిన్నారులు ప్రతిభ కనబరిచారు. 12-14 ఏళ్ల కేటగిరీలో రాష్ట్రం నుంచి 13 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఉప్పల్‌కు చెందిన అచీవర్స్ తైక్వాండో అకాడమీ తరఫున పాల్గొన్న ఐదుగురిలో స్వర్ణం 3, రజతం 2 సాధించగా.. అకాడమీ నిర్వాహకుడు, కోచ్ పృథ్వీ వారిని అభినందించారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

**అల్వాల్:** అల్వాల్ డివిజన్ శ్రీనివాస్‌నగర్‌లో జరుగుతున్న రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. గీత స్కూల్ పక్కన 665 గజాల పార్కు స్థలం కబ్జా కాకుండా చూస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. డీఈ ప్రశాంతి, ఏఈ అభిషేక్, రామారావు, కాలనీవాసులు హరినాథ్‌రావు, సునీల్, రఘురాంరెడ్డి, సతీష్, రాజేశ్వర్ రెడ్డి, వరలక్ష్మి, నాయకులు ప్రేమ్‌కుమార్, యాదగిరిగౌడ్, సాజిత్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

## అధికారులపై చర్యలు తీసుకోవాలి

**ఉప్పల్:** ఉప్పల్ మున్సిపల్ క్రీడా మైదానంలో డిసెంబర్ 31న ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించే ఈవెంట్‌కు అనుమతి ఇవ్వడాన్ని తప్పు పడుతూ.. చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇల్లంభర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ వెంట్ ఆర్గనైజర్లు డిసెంబర్ 31న క్రీడా మైదానంలో మద్యం విక్రయాలు జరపడంపై విచారణ వ్యక్తం చేశారు. కేవలం సాంస్కృతిక కార్యక్రమాలు, స్కూల్స్ గేమ్స్, ప్రార్థన కార్యక్రమాలకు మాత్రమే అనుమతించే వారని, ఇప్పుడు ఏకంగా మద్యం విక్రయిస్తూ క్రీడాస్ఫూర్తిని దెబ్బ తీశారని మండిపడ్డారు. అనుమతులు ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అప్పుల ఒత్తిడి తట్టుకోలేక..
యువకుడి అదృశ్యం

**కుషాయిగూడ:** బెట్టింగ్ కోసం అప్పులు తీసుకొచ్చి ఒత్తిడితో ఓ యువకుడు అదృశ్యమైన ఘటన చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. చర్లపల్లి, లక్ష్మీనగర్‌లో నివసించే బూక్య శివకుమార్ గత మూడేళ్లుగా బెట్టింగులు ఆడుతూ.. సుమారు రూ.50 లక్షల వరకు అప్పులు చేసి, సగం వరకు తీర్చాడు. మిగిలిన అప్పులు కట్టలేని పరిస్థితులు రావడంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా మాస్టర్ కల్చరల్ ఫెస్ట్

**మౌలాలి :** నేషనల్ కృష్ణవేణి, ది మాస్టర్ మైండ్ పాఠశాలతో పాటు 140 పాఠశాలలు సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్‌స్కూల్ కాంపిటీషన్స్ ఘనంగా జరిగింది. గురువారం ‘మాస్టర్ కల్చరల్ ఫెస్ట్ 2024-25’లో కృష్ణవేణి పాఠశాల ఓల్డ్ సపిల్‌గూడ బ్రాంచ్ డ్యాన్స్, సైన్స్ ప్రాజెక్టుతో పాటు పలు విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విజేతలకు డైరెక్టర్ చంద్రమౌళి పతకాలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. కృష్ణవేణి ప్రిన్సిపాల్ జాన్, సురేష్‌బాబు, వెంకటేష్, శ్వేత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పతకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు